

టీటీడీకి 18 క్లీనింగ్ యంత్రాలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల: కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) లో భాగంగా ఐడిబిఐ బ్యాంక్ టీటీడీ ఆరోగ్య విభాగానికి రూ.19 లక్షల విలువైన 18 క్లీనింగ్ మెషీన్ల ను ఆదివారం విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ బ్యాంకు ఎండీ అండ్ సీఈఓ రాకేష్ శర్మ శ్రీవారి ఆలయం ముందు పేష్కార్ రామకృష్ణ కు యంత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆరోగ్యాధికారి మధుసూదన్, ఐడీబీఐ బ్యాంక్ రీజనల్ హెడ్ సాయికృష్ణ, తిరుపతి బ్రాంచ్ హెడ్ పల్లి రమేష్, బ్రాంచ్ మేనేజర్ దూడల రాజేష్ పాల్గొన్నారు.

సెజ్‌ల నెలవు.. భద్రత కరువు

"కార్మికుల ప్రాణాలకు ఖరీదు కట్టే షరాబు లేడోయ్"

- విధులకు వెళితే వెనుదిరిగి వస్తామా..?
- పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు
- కానరాని కార్మికశాఖ తనిఖీలు
- వరుస ప్రమాదాలతో స్థానికుల ఆందోళనలు
- పరిశ్రమల నిర్వహణపై ఏవీ ఉన్నత స్థాయి సమీక్షలు
- కన్నీటి తుడుపుకే పరిమితమైన నాయకుల వాగ్దానాలు

ప్రజాశక్తి -నాయుడుపేట :

" పల్లెటూళ్లు.. దేశానికి పట్టుకొమ్మలు అనేది పాత నానుడి.. పరిశ్రమలు దేశాభివృద్ధికి సోపానాలన్నది నేటి ఒరవడి.."

తిరుపతి జిల్లా తూర్పు మండలాలలో గూడూరు మొదలుకొని నాయుడుపేట, తడ, సత్యవేడు వరకు శ్రీసిటి, మాంబట్టు, మేనకూరు పరిశ్రమల నెలవుగా (స్పెషల్ ఎకనామిక్ జోన్స్) సెజ్‌లు వెలిశాయి. ప్రభుత్వం ఇస్తున్న ఉచితాలు, రాయితీలతో భూమి, నీరు, కరెంటు వంటి ఎన్నో సౌకర్యాలు పొంది స్థానికులకు వేల ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇచ్చి అట్టహాసంగా పరిశ్రమలు ప్రారంభిస్తున్నారు. దనార్జనే ధ్యేయంగా బూర్జువా పెట్టుబడిదారులు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు సొంతం చేసుకోవడానికి, మహార్భాటంగా పరిశ్రమలను నెలకొల్పి, కార్మికుల శ్రమను పెట్టుబడిగా పెడుతూ అబ్బో.. ఇంకేముంది, పరిశ్రమలు వచ్చేశాయ్.. అభివృద్ధి చేసేశాం, ఉద్యోగాలిచ్చేశామని ప్రభుత్వాలు ఆర్భాటాలు చేస్తున్నాయి. కానీ కొన్నాళ్లకే నష్టాల సాకు చూపి బోర్డు తిప్పేసిన సంస్థలు తమకు ప్రభుత్వం ఇచ్చిన రాయితీ, వసతులను అప్పణంగా నొక్కేస్తున్నాయి.

ఇదొక కోణమైతే.. మరో కోణమేమంటే పరిశ్రమలు నియమ నిబంధనలు పాటించకుండా, కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలు పణంగా పెట్టి ధనార్జనే ధ్యేయంగా ఉద్యోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. కోట్లాది రూపాయలు వెనకేసుకుంటున్నాయి. పరిశ్రమల్లో పాటిస్తున్న ప్రమాణాలను తనిఖీ చేయాల్సిన కార్మిక శాఖ మామూళ్ల మత్తులో జోగుతోందన్న విమర్శలు లేకపోలేదు.

ఇటీవలి కాలంలో కర్మాగారాల్లో అగ్ని ప్రమాదాలు నిత్య కృత్యమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వైపు నుండి పరిశ్రమల నిర్వహణకు నిర్వాహకులు ఎలాంటి నిబంధనలు పాటిస్తున్నారు అని ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. చిన్న చిన్న పొరబాట్లు వలన పెద్ద ప్రమాదాలు సంభవించి కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

పరిశ్రమ ఏర్పాటు అయ్యేటప్పుడు..

నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే క్రమంలో వారికి విరివిగా బ్యాంకుల నుంచి రుణాలు అందించడమే కాకుండా, పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన అనుమతులన్నింటినీ రోజుల వ్యవధిలో చేస్తామని ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహిస్తున్నారు. వేల సంఖ్యలో పదుల కంపెనీలు మాత్రమే ఈ విధంగా నేటికీ కొనసాగుతున్నాయన్నది వాస్తవం. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ, రుణాల రాయితీలను అన్నింటిని పొందుతూ దీర్ఘకాలికంగా ఎంఎస్ఎంఈ కంపెనీలు మనుగడను సాధించలేకపోతున్నాయని విమర్శలు ఉన్నాయి. రాయితీలు పొంది పరిశ్రమలు ఏర్పాటు చేసి కొద్ది సంవత్సరాల తర్వాత నష్టాల బాటలో కంపెనీ ఉందని మూసేసిన సందర్భాలు కొన్ని పరిశ్రమలకు సంబంధించి ఇప్పటికీ ఉన్నాయి.

ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే..

సాధారణంగా ఒక కంపెనీ నిర్మాణం ప్రారంభం నుండి వినియోగ దశ వరకు ఆ కంపెనీ నిర్మాణంలో వినియోగించిన ప్రతి వస్తువుకు సంబంధించి నాణ్యతతో కూడిన వస్తు వినియోగం జరిగిందా లేదా అనే ప్రక్రియను ఏ పార్టీకి గమనిస్తున్నారో ప్రభుత్వాలకే తెలియాలి. ఇలా ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక శాఖ సిబ్బంది సమాచారం అందిన వెంటనే ఘటన ప్రదేశానికి వెళ్లి ఆ మంటలను అదుపు చేసి ఆస్తి నష్టాన్ని, ప్రాణ నష్టాన్ని నిలువరించడానికి ప్రయత్నం చేస్తారు. ప్రస్తుతం ఏ కంపెనీకి సంబంధించి అగ్నిమాపక శాఖ నుండి క్లియరెన్స్ కావాలన్నా జిల్లా అధికారులతో పని లేకుండా డైరెక్ట్‌గా డీజీ ఫైర్స్ కు దరఖాస్తు చేసుకుంటే వారే దానికి తగ్గ అనుమతులు మంజూరు చేస్తున్న పరిస్థితి. ఇక జిల్లా విషయానికొస్తే జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు ఎవరూ కంపెనీలలో ఫైర్ సేఫ్టీ ఏ మేరకు పాటిస్తున్నారు అని ఆకస్మిక తనిఖీలు కేవలం రాష్ట్ర కేంద్రం నుండి తగిన ఆదేశాలు వస్తే తప్ప వెళ్లి పరిశీలించలేని పరిస్థితులు నేడు ఉన్నాయి. అగ్ని ప్రమాదాలు జరిగితే ప్రమాద దాటి నుండి ఆస్తి నష్టాన్ని, ప్రాణ నష్టాన్ని ఎలా తగ్గించుకోవాలి అనే విషయాలను అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా వివిధ ప్రదేశాలలో అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్స్ ద్వారా తెలియజేస్తారు.

నష్ట అంచనాల పరిస్థితి ఆ సంగతే వేరు..

పరిశ్రమలకు సంబంధించి ఏదేని ప్రమాదం జరిగితే సంబంధిత విభాగపు అధికారులు హడావిడి చేస్తూ కంపెనీకి జరిగిన నష్టాన్ని, ప్రమాదంలో ప్రాణ నష్టాన్ని అంచనాలు వేయడం, ఆ అంచనాలకు తగ్గట్టుగా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకున్నట్లు సందర్భాలు లేనే లేవనే చెప్పాలి. కంపెనీలకు వత్తాసు పలుకుతూ ప్రమాద ఘటనలకు సంబంధించి రిపోర్టులు తయారు చేయడం పరిపాటిగా మారిపోయిందని విమర్శలు ఉన్నాయి. కాలే కడుపు కోసం కార్మిక వృత్తిని ఎంచుకొని కర్మాగారాలలో అడుగుపెట్టిన కార్మికుడికి ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కార్మికుడి కుటుంబం కన్నీళ్లలో మునిగిపోయే పరిస్థితులను నేటి ప్రభుత్వాలు గుర్తించి పరిశ్రమల నిర్వహణపై పటిష్టమైన ఎన్ఫోర్స్మెంట్ అథారిటీని ప్రత్యేకంగా నియమించాల్సిన ఆవశ్యకత ఉందని మేధావుల సూచన.

ఏర్పేడు మండలం, వికృతమాల, ఇఎంసి 2 వద్ద మునోత్ ఇండస్ట్రీలో అగ్ని ప్రమాదం (ఫైల్ ఫోటో)

సెప్టెంబర్ 13 న గూడూరు రూరల్ పరిధిలోని ఓ పరిశ్రమలో 600 డిగ్రీల సెల్సియస్ జింక్‌పాట్‌లో పడి దుర్మరణం పాలైన ఆదిత్యకుమార్

ఇటీవల జరిగిన ప్రమాదాలు..

– పెళ్లకూరు మండలంలో ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమలు నలుగురు కార్మికులు మరణించారు. టీవీఎస్ పరిశ్రమలో ఇటీవల ఒక కార్మికుడు మరణించారు. గతంలో హిందుస్థాన్ పరిశ్రమలో ప్రమాదం చోటుచేసుకుని మహిళ కార్మికులు కూడా ప్రాణాలు కోల్పోయారు. మేనకూరు సెజ్, ఓజిలి,పెళ్ళకూరు మండలాలలో ఉన్న పరిశ్రమలలో తరచూ ప్రమాదాలు జరిగి ఎంతోమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. అయినా సెజ్ అధికారులు, లేబర్ అధికారులు కార్మికుల ప్రాణాలపై శ్రద్ధ చూపడం లేదు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కర్మాగారాల యాజమాన్యంపై కఠిన చర్యలు చేపట్టిన ధాఖలాలు లేవు.

ఏర్పేడు మండలం, వికృతమాల పరిసరాల్లో ఇఎంసి 2 వద్ద మునోత్ ఇండస్ట్రీ (లిథియం సెల్ మ్యానుఫ్యాక్చరింగ్)లో గురువారం తెల్లవారుజామున 3.30గం సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది.

మేనకూరు సెజ్‌లో స్థానికుల, స్థానికేతరులు వేలాదిమంది కార్మికులు పొట్టకూటికోసం పని చేస్తున్నారు. భద్రతా చర్యల పర్యవేక్షణకు అధికారులు నీళ్ళు వదిలేస్తున్నారు. కార్మికులకు భద్రతలపై నిఘా ఉంచితే ఇలాంటి ప్రమాదాలును నియంత్రించవచ్చు. సెజ్ ప్రధాన అధికారి జెడ్ ఎమ్‌ను కలిసేందుకు ప్రయత్నం చేసినా విఫలమయ్యాం.

- సిఐటియు నాయకులు శివకవి ముకుంద

గురువారం నాయుడుపేట సెజ్ లోని అరబిందో ఫార్మాసిటికల్ కంపెనీలో సంభవించింది చాలా పెద్ద ప్రమాదం. అందులో యాజమాన్య లోపం చాలా వరకు ఉంది. సెజ్ లో కొన్ని పరిశ్రమలను ఇప్పటికే పరిశీలించాం. పది కంపెనీలను రెడ్ జోన్‌గా గుర్తించాం. కొన్ని కంపెనీల్లో ప్రమాద నివారణ పరికరాలు లేవు. వాటిని సమకూర్చుకోవాలని యాజమాన్యాలకు సూచించాం. ఇటీవలే బదిలీపై వచ్చినందున ఇంకా కొన్ని పరిశ్రమలను పర్యవేక్షించాల్సి ఉంది.

- నాయుడుపేట అగ్నిమాపక అధికారి కే.సునీల్ కుమార్

నేను సిఐగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇది రెండవ ప్రమాదం. అరబిందో కంపెనీలో జరిగిన ప్రమాదంలో కార్మికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, బ్రేక్స్ ఇండియా కంపెనీలో కార్మికుని మరణంలో కంపెనీ యాజమాన్యం పొరపాటు లేదు. ప్రతి కంపెనీని తరచూ పరిశీలిస్తున్నాం. యాజమాన్యాలు అవసరమైన జాగ్రత్తలు పాటిస్తున్నామని తెలియజేశారు.

- నాయుడుపేట అర్బన్ సీఐ బాబీ

నిరూపిస్తే.. తల నరుక్కుంటా

- టిటిడి పరకామణి చోరీ ఘటనపై భూమన కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : టిటిడి పరకామణిలో నా హయాంలో తప్పు జరిగిందని నిరూపిస్తే అలిపిరి వద్ద తన తల నరుక్కుంటానని, తన తప్పు కాదని తేలితే బహిరంగ క్షమాపణ చెప్పాలని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సవాలు విసిరారు. తిరుపతి పద్మావతి పురంలోని కరుణాకర్ రెడ్డి నివాసం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నారా లోకేష్, బిఆర్ నాయుడుల ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నారు. 2023లో జీయర్ మఠానికి చెందిన రవికుమార్ పరకామణిలో పనిచేస్తుండగా దోచుకున్న రూ.72 వేలు విలువ చేసే, 8 విదేశీ డాలర్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. అతను 20 సంవత్సరాలుగా పని చేస్తున్నాడని, చోరీలు చేస్తున్నాడనే విషయం బయట పెట్టింది తమ హయాంలోని అధికారులేనని తెలిపారు. రవికుమార్ కుటుంబీకులు అపరాధంగా భావించి దేవస్థానం అధికారులని కలిసి, ప్రాయశ్చిత్తంగా 100 కోట్ల రూపాయల ఆస్తులను టీటీడీకి దఖలు పరిచారని గుర్తు చేశారు. 2023లో 14 కోట్ల రూపాయల ఆస్తులను టీటీడీకి ఇవ్వడం జరిగిందన్నారు. మరి చంద్రబాబు హయాంలో కూడా రవికుమార్ చోరీలు చేసేవాడుకదా అని ప్రశ్నించారు. డబ్బులు కొట్టేయాలనుకున్న వారు పట్టుకుంటారా అన్నారు. విజిలెన్స్ నివేదికను బయట పెట్టాలని, ఈ వ్యవహారంపై సీబీఐ ద్వారా విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే అభివృద్ధి చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : గత ప్రభుత్వం పేద విద్యార్థుల మెడికల్ సీట్లు అమ్ముకుని 107,108 లను తెచ్చి వైద్య విద్యా వ్యాపారం చేసిందని దీనిపై పోరాటాలు జరిగుతున్న దశలో.. కూటమి ప్రభుత్వం రాగానే వాటిని రద్దు చేస్తామని చెప్పి నేడు మొత్తం వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ విమర్శించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడం అన్యాయమని, తక్షణమే ప్రభుత్వమే మెడికల్ కళాశాలలు అభివృద్ధి చేయాలనీ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు అక్బర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిమాండ్ చేశారు. అక్బర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధానాన్ని పీపీపీ రూపంలో కూటమి ప్రభుత్వం వైద్య విద్య ద్వారా బహిరంగంగా దోపిడీ చేసుకోడానికి దారులు తెరవడం సరికాదని ఆరోపించారు. రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలలు ప్రభుత్వమే అభివృద్ధి చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉంటుందన్నారు. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాల నిర్వహించడమంటే కార్పొరేట్ సంస్థలకు అప్పజేప్పడమేనని మండి పడ్డారు. ఇప్పటికే విద్య కార్పొరేట్‌లో వ్యాపార సరుకుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యార్థి సంఘాలు కలుపుకొని పోరాటాలకు సిద్ధం అవుతామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ హాస్టల్ సమస్యలు అనేకం ఉన్నాయని, ఈ సమస్యలపై జిల్లాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, తేజ, సహాయ కార్యదర్శిలు వీరష్, ఉమేష్, రమణ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, రవీంద్ర, సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అక్టోబర్ 23,24 తేదీల్లో జరిగే ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులు మల్లికార్జున్ అధ్యక్షత వహించిన ఈ సమావేశవంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు షేక్ జిలాని భాష, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కట్టా సుబ్రహ్మణ్యం అతిథులుగా పాల్గొన్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ ఏపిఎస్ఆర్టిసిని నిర్వీర్యం చేయడానికి, కార్పొరేట్ల పరం చేయడానికి ప్రభుత్వం పూనుకున్నదని, అందుకనే ఆర్టీసీ ఆస్తులను, బస్టాండ్లను ప్రైవేటు వారికి అప్పగిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర అసెంబ్లీలో పనిగంటలు పెంచడానికి ఆ తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడాన్ని తప్పుపట్టారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్కే జిల్లాని భాష మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీ సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు నోరు తెరవడం లేదని, ప్రతి విషయాన్ని ఎదుర్కొని పోరాడుతున్న సంఘం ఎస్డబ్ల్యుఎఫ్ అన్నారు. ఈ సమావేశంలో ఎస్డబ్ల్యుఎఫ్ వ్యవస్థాపక సభ్యులు జి బాలసుబ్రమణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.పరశురాం, కడప జోనల్ కార్యదర్శి సి.భాస్కర్. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ శివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు మాధవ్, మెడికల్ రెప్స్ యూనియన్ కార్యదర్శి ఆనంద్ సంఘీభావం తెలిపారు. వీరితో పాటు వివిధ డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, ఎలక్ట్రికల్ బస్సు నాయకులు మునీంద్ర, యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు గుంతలమయం.. సిపిఎం నిరసన



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీలో ఏ వీధిలో చూసిన రోడ్లు పెద్ద పెద్ద గుంతలతో నిండిపోయి ప్రజలు, వాహనదారులు, స్కూలు పిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలతో విసిగిపోయిన ప్రజలు ఆదివారం ఉదయం సిపిఎం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆ వీధులలోని గుంతల వద్ద అపాయం బోర్డులు పెట్టి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు సతీష్, అబ్దుల్లా మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పొగ గొట్టం, అమరా గార్డెన్, అగ్రహార పేట, ట్రెజరీ వీధి, రాజగోపాలపురం, బేరిపేట ప్రాంతాల్లో కాలువలు దెబ్బతిని, మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తోందని, నాలుగు చినుకులు పడితేనే వీధులన్ని చెరువులను తలపిస్తున్నాయన్నారు. గుంతలు పడి రోడ్లు పెద్ద కాలవల్లా మారిపోయాయని ఆ గుంతల్లో పలుమార్లు చిన్నపిల్లలు, ముసలివారు పడి ప్రమాదానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు శివకవి ముకుంద, మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీలో మచ్చుకు ఒక్క మంచి రోడ్డు కూడా లేదన్నారు. రోడ్లు వేయమని మునిసిపల్ కమిషనర్‌కి పలుమార్లు అర్జీలు ఇచ్చామని, కమిషనర్ ఇప్పుడు మున్సిపాలిటీలో డబ్బులు లేవని చెబుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చి మున్సిపాలిటీలో రోడ్లు వేస్తారు అనుకుంటే ఏటి పండగకు ప్రజాసొమ్ము సుమారు 25 లక్షల రూపాయలు స్టేజి ఖర్చు పెట్టుకుని ఉపన్యాసాలు ఇచ్చారే కానీ ఆ డబ్బు రోడ్లుకు, మురుకు నీటి కాలువల మరమ్మతులకు ఖర్చుపెట్టి ఉంటే ఈరోజు ప్రజలు ఇబ్బంది పడేవారు కాదన్నారు. అవాజ్ నాయకులు హలీమ్ ఖాన్ మాట్లాడుతూ మున్సిసల్ అధికారులకు పొద్దున లేచిన దగ్గర నుంచి మైకుల్లో అనౌన్స్‌మెంట్లు చేస్తూ పన్ను వసూళ్లలో ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని సిమెంట్ రోడ్లు నిర్మించాలని, లేని పక్షంలో పోరాటాల బాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయమ్మ, సుబ్బరత్నమ్మ, అజీమా, హుస్సేనమ్మ, రాజమ్మ, గోవిందమ్మ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి జెండా మహోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నవరాత్రులు ముందు గూడూరులో వైభవంగా ఆంజనేయస్వామి జెండా పండుగ నిర్వహిస్తారు. ఆదివారం గూడూరులో మహాలయ అమావాస్య సందర్భంగా స్వామి వారి జెండా ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి చిత్రపటాన్ని ఉత్సవ కమిటి నిర్వాహకులు ఊరేగించారు.

ప్రజాశక్తి-కోట : కోట మండలం, వెంకన్నపాలెం గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి జెండా మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుర్రం అశోక్ కుమార్, సర్పంచ్ కోకర్ల మధు యాదవ్‌ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ ఆంజనేయస్వామి భక్త బృందం జెండా పండుగ మహోత్సవం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని గణపతి ఆలయంలో మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

నిమిషానికి మూడు బస్సులు

- బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీ సేవలు
- 'ప్రజాశక్తి'తో ఆర్ఎం జగదీష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:

'నిమిషానికి మూడు బస్సుల చొప్పున గరుడసేవ రోజు ఎపిఎస్ఆర్టీసీ సేవలు అందించనుంది..' అని ఎపిఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జగదీష్ చెప్పారు. సెప్టెంబర్ 24–అక్టోబర్ 2 వరకు శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిపేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాటు చేసింది. దసరా సెలవులు, తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాల్లో దాదాపు 20 లక్షల మంది ప్రయాణికులు వస్తారని అంచనా. ఈ నేపథ్యంలో ఎపిఎస్ ఆర్టీసీ అందిస్తున్న సేవలను వివరించారు. ఆయన మాటల్లోనే..



తిరుమల వెళ్లే బస్సులను ఆరు రకాలుగా ఫిట్‌నెస్ తనిఖీలు చేపట్టాం. ముఖ్యంగా డిపో గ్యారేజీలో మెకానిక్‌లు, వేరే గ్యారేజీల నుంచి మెకానిక్ తనిఖీలు, టాటా, అశోక్‌లేలాండ్ బస్సులు ఉండడంతో ఆయా కంపెనీలకు చెందిన స్పెషల్ ఇంజినీర్లతో తనిఖీలు చేశాం. ఆర్టీసీలో డిప్యూటీ సిటిఎం ఇంజినీర్లతోనూ, అధికారులతోనూ తనిఖీ చేశాం. బస్సుల బ్రేకులు, స్టీరింగ్ విషయాల్లో జాగ్రత్తలు తీసుకున్నాం. బ్రహ్మోత్సవాల సందర్భంగా అలిపిరి, తిరుమల, మంగళం, తిరుపతి, పుత్తూరు, గూడూరు, వెంకటగిరి డిపోల పరిధిలో 434 బస్సులు నిరంతరం తిరుమలకు తిరుగుతాయి. ఎలక్ట్రికల్ బస్సులు 60 పైగా తిప్పుతాం. ఒక్క గరుడసేవ రోజే నిమిషానికి మూడు బస్సులు తిరుమలకు భక్తులను చేరవేస్తాయి. గరుడసేవ రోజు 24 గంటలూ నిరంతరాయం బస్సులు తిరుగుతాయి. మిగిలిన రోజుల్లో మాత్రం రాత్రి 11 గంటల వరకే సేవలను అందిస్తాం. గరుడసేవ రోజు ముందురోజే ద్విచక్రవాహనాలను నిషేధించడం వల్ల స్థానికుల కోసం వకుళమాత, మంగళం, కరకంబాడి రోడ్డులోని ఎస్‌విసి ఇంజినీరింగ్ కాలేజీ, తిరుచానూరు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల పార్కింగ్‌ను దేవస్థానం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల నుంచి బస్సులను అందుబాటులో ఉంచనున్నాం. అద్దె బస్సుల వారు రోజుకు ఒక గంట ఉచితంగా భక్తుల కోసం సేవ చేసేందుకు ముందుకొచ్చారు. తిరుమలకు వెళ్లే బస్సులు బ్రహ్మోత్సవాలు జరిగినంత కాలం అలిపిరి గరుడ సర్కిల్ వరకే బస్సులు తిరుగుతాయి. బస్సులను బస్టాండ్, రైల్వేస్టేషన్లను చేరవేసేందుకు ఉచితంగానే ఆర్టీసీ 45 బస్సులు సేవలను అందించనుంది. 2024–25 బ్రహ్మోత్సవాల్లో ఒక్క గరుడసేవ రోజే లక్షా 80వేల మందిని తిరుమల తిరుపతి మధ్య చేరవేశాం. బ్రహ్మోత్సవాల్లో పది లక్షల మందికి ఆర్టీసీ సేవలను అందించింది. ఈ ఏడాది 12 లక్షలు టార్గెట్‌గా పెట్టుకుని భక్తులకు విస్తృతంగా సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేశాం. సెక్యూరిటీ, కండక్టర్లు అదనంగా 715 మందిని బయట డిపోల నుంచి రప్పిస్తున్నాం. స్పెషల్ డ్యూటీపైన 50 మంది అధికారులను వివిధ జిల్లాల నుంచి రానున్నారు. భక్తులు క్షేమంగా శ్రీవారిని దర్శించుకునేలా చూడటమే ఎపిఎస్ఆర్టీసీ లక్ష్యం. ఫ్రీ బస్సు ప్రభావమూ ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో ఉండనుంది.

పని గంటలు తగ్గించి, కనీస వేతనం ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు మధుసూదన్ రావు

ప్రజాశక్తి -పాకాల: స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో సిఐటియు మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మధుసూదన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 13 గంటల పనిని, 8 గంటలకు తగ్గించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో నాయకులు మురళి, ఆనంద్, శేఖర్, నరేంద్ర, వెంకటరమణ, మోహన్ బాబ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇస్తిమా

ప్రజాశక్తి -పాకాల : ఉమ్మడి చిత్తూరు జిల్లా ముస్లిం సోదరుల ఆధ్యాత్మిక సమావేశంలో భాగంగా నిర్వహించిన ఇస్తిమా కార్యక్రమం వేలాది మంది ముస్లిం సోదరులతో పాకాలలో ఘనంగా నిర్వహించారు. ఇరంగారిపల్లి సమీపంలో ఈ కార్యక్రమాన్ని శని, ఆదివారాలు నిర్వహించారు. ముస్లింలు ఈ కార్యక్రమానికి హాజరై మత పెద్దలు చెప్పిన విషయాలను ఆలకించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలలు, ముస్లిం సోదరులు, పిల్లలు పాల్గొన్నారు.

కరాటేలో నిహాల్ మనోహర్‌కు కాంస్యం

ప్రజాశక్తి - కోట : నెల్లూరు సోమిశెట్టి కళ్యాణమండపంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కోట మండలం, శ్రీప్రగతి విద్యా నికేతన్ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థి పసుపులేటి నిహాల్ మనోహర్ కాంస్య పతకం సాధించాడు. నిహాల్ మనోహర్ కరాటే లోనే కాక, అర్చరిలో కూడా జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా విద్యా సంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ నిహాల్ మనోహర్, కరాటే మాస్టర్ హరిబాబులను అభినందించారు.

సావిత్రిబాయి పూలే ట్యూషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం, పెన్నేపల్లిలో తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం, విశ్వ మానవ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే ట్యూషన్ సెంటర్‌ను విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పసల మస్తాన్ రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే ఉద్దేశంతో ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లారపు నాగార్జున, ప్రధాన కార్యదర్శి వేమన విజ్ఞాన కేంద్రం డాక్టర్ టి.రవీంద్ర కుమార్, మెడికల్ ఆఫీసర్ డి.ప్రభాకర్, ధమాయ వెంకయ్య, పుట్ల తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ ఫౌండేషన్ వంశీకి అవార్డు

ప్రజాశక్తి -ఏర్పేడు: శ్రీ లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ 3వ వార్షికోత్సవం ఆదివారం తిరుపతి యూత్ హాస్టల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అవార్డులను ప్రదానం చేసింది. ఈ క్రమంలో తాను చేస్తున్న సేవలను గుర్తించి స్వేచ్ఛ ఫౌండేషన్ ఫౌండర్ వంశీ యాదవ్‌కి వెంకటలక్ష్మి, శ్రీధర్ చేతుల మీదగా అవార్డు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వంశీ యాదవ్ లక్ష్మీ నరసింహా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ వెంకటలక్ష్మికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎంతో మంది వృద్ధులు, వికలాంగులను తల్లిగా, అక్కల కంటికి రెప్పల కాపాడుకోవడం గర్వకారణమన్నారు.

అధ్వానంగా ఈటీసీ రోడ్డు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని ఈటీసీ కేంద్రం నుంచి జ్ఞానాలకంబ్రిగుకు వెళ్లే రోడ్డు మార్గం అధ్వానంగా తయారైంది. రోడ్డు వేశారే కానీ దాని బాగోగులు పట్టించుకోకపోవడంతో బావుల్లాంటి గోతులు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసిన ప్రతిసారి గోతుల్లో మోకాలు లోతున నీళ్లు నిలబడుతుండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అన్ని శాఖల అధికారులకు కేంద్రం ఇక్కడే ఈటీసీ ముందర రోడ్డు దుస్థితి ఇలా ఉంటే తక్కిన చోట్ల పరిస్థితేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మార్గంలో కాసా గార్డెన్ బాలికల గురుకులం కూడా ఉంది. తొట్టంబేడు మండలంలోని జ్ఞానాలకంబ్రిగు, కొత్తకండ్రిగ గ్రామాల ప్రజలు, విద్యార్థులు నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈటీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్రికెట్ విజేత సంస్కృత విశ్వవిద్యాలయం

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక తారకరామ స్టేడియంలో జరుగుతున్న మెగా కార్పొరేట్ క్రికెట్ పోటీలలో నేషనల్ సంస్కృత విశ్వవిద్యాలయం, అమరాజా జట్టు తలపడగా అమరాజ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 129 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. సంస్కృత విశ్వవిద్యాలయం జట్టు 15 ఓవర్లలో 130 పరుగులు చేసి విజయాన్ని సాధించింది. విజేతలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.యస్.ఆర్ కృష్ణమూర్తి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తి, విశ్వవిద్యాలయ యాజమాన్యం వారు అభినందించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం పలువురు ప్రముఖులు విచ్చేశారు. కర్ణాటకకు చెందిన ఎమ్మెల్యే మల్లికార్జున మాదల్, తమిళనాడు ఐడిఎస్ఎల్ జడ్ అన్బు, గుజరాత్ మాజీ హైకోర్టు జడ్జి థాకర్, కర్ణాటక హైకోర్టు జడ్జి అను శివరామన్, మహారాష్ట్రకు చెందిన ఐపిఎస్ అధికారి ప్రశాంత్ అమృత్కర్ కుటుంబంతో దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు దర్శనం ఏర్పాట్లు చేశారు.

శ్మశానం ఆక్రమణను అడ్డుకున్న దళితులు

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని సుబ్రహ్మణ్యం గ్రామంలోని దళితుల స్మశాన భూమిని గ్రామానికి చెందిన కొందరు అగ్రవర్ణాలు ఆదివారం దురాక్రమణ చేసే ఎత్తుగడతో మొక్కలు తొలగిస్తుండగా దళితులు అడ్డుకున్నారు. ఆక్రమణ దారులు, దళితుల మధ్య వివాదం నెలకొనడంతో దళితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దళితుల స్మశాన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని దళితులు కోరుతున్నారు.

పుష్కర ఘాట్లలో వసతులు కరువు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహాలయ అమావాస్య సందర్భంగా స్వర్ణముఖి నదిలో పిండ ప్రధానాలు చేసేందుకు పుష్కర ఘాట్ల వద్ద సరైన వసతులు కల్పించలేదని హిందూ ధార్మిక సంఘ సభ్యులు గరికపాటి రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ కాశీగా పేరొందిన శ్రీకాళహస్తిలో సువర్ణముఖి నదిలో ప్రజలు పిండ ప్రదానం, తర్పణాలు వదలడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు రాగా ఆ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయలేదని మండిపడ్డారు. సరైన స్నాన ఘట్టాలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా గదులు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తిరుపతిలో నవయుగ రన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: దేశవ్యాప్తంగా 75 ప్రాంతాల్లో నిర్వహించిన నవయుగ రన్‌లో భాగంగా, తిరుపతిలో యస్వి ఆర్ట్స్ కాలేజ్, బాలాజీ కాలనీ నుండి ఇందిరామైదానం వరకు ఆదివారం 3 కిలోమీటర్ల రన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్ రహిత జీవనశైలిని ఎంచుకోవాలని, మాతృదేశాన్ని కాపాడే సైనికులుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ, పెళ్లకూరు వాగాల లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ ఉచితంగా ఇస్తున్నట్లు ట్రస్టు ఎండీ చాగం గౌరీశంకర్, సీతాల సీతారామ నాయుడు తెలిపారు. ప్రతి బ్యాచ్‌కి 35 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు ఏడు కృష్ణ గల్ల, శిక్షకులు భారతి తెలిపారు.

ఎస్‌వి విశ్వనాథ నాయుడు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న విశ్వనాథ నాయుడు ఉద్యోగ విరమణ చేశారు. ఆదివారం శ్రీకాళహస్తి శివపార్వతి ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగ విరమణ కార్యక్రమం జిల్లా అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులు, రాజకీయ నాయకులు, సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి నరసింహమూర్తి, సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య, టూ టౌన్, వన్ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎప్పుడో జీవో వస్తే.. ఇప్పుడు దరఖాస్తు ఏమిటో..!

■ ప్రణాళిక బద్ధంగా పంట కాలువ పూడ్చివేత ■ సెలవుల్లో పంట కాలువ మళ్లింపు పనులు పూర్తి ■ చోద్యం చూస్తున్న అధికార గణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అది కోట్లు విలువ చేసే వంటకాలవకు సంబంధించిన భూమి. సదరు భూమికి సంబంధించి గతంలోనూ అనేక వివాదాలతో కొన్ని సంఘటనలు జరిగి రెవిన్యూ, పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన పరిస్థితి. మళ్లీ ఎలాగైనా స్థలం మధ్యలో పారుతున్న పంట కాలువను దారి మళ్లించడానికి లేఅవుట్ వేసిన నిర్వాహకులు పక్కా ప్రణాళిక ప్రకారం సీసీ డ్రెయిన్ ముందస్తుగానే నిర్మాణం చేసుకొని, అటు తర్వాత పంట కాలువ నీరు లే అవుట్ లోకి ప్రవహించే మార్గాన్ని ప్రణాళిక బద్ధంగా దారి మళ్లించేశారు.

ఈ ఏడాది జూన్ 9న పంట కాలవను లేఔట్ లోనికి పోకుండా నీటిని కాంక్రీట్ కాలువ వైపు మళ్లించిన దృశ్యం

లేఅవుట్ క్రమంగా ఉండడానికి తమకు అనుకూలంగా భూమిని మలుచుకోవడానికి ప్రత్యేక వ్యూహాలను ఈ లేఔట్ నిర్వాహకులు రచించారు. ప్రభుత్వ సెలవు దినాల కోసం ఎదురుచూపులు చూసి సూర్యోదయం నుండి సూర్యాస్తమయం లోపల జెసిబి యంత్రాల సహాయంతో పంట కాలువను రూపుమాపి తాము ముందుగానే లేఅవుట్ వెలుపల పిల్లర్ గోడలకు ఆనుకుని నిర్మించిన కాంక్రీట్ కాలువవైపు మళ్లించేశారు. ఈ ఏడాది జనవరి మాసం నుండి ఈ ప్రక్రియ జరుగుతూ వచ్చి నేడు పంట కాలవను పూర్తిగా పూడ్చివేశారు. ఇదంతా ఎక్కడ అనుకుంటున్నారా.... మంగళం రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లికి వెళ్లే మార్గంలో మిట్టగాంధీపురం సమీపంలో జరుగుతోంది ఈ తంతు. సుమారు 5 ఎకరాల పైబడి ఉన్న భూమిలో కొంత భూమి తమదని ఇటీవల జనవరి 22వ తేదీన ఓ మహిళ పెద్ద ఎత్తున తన మనుషులను స్థలం వద్దకు తీసుకువచ్చి గొడవకు దిగిన పరిస్థితి. అటు తర్వాత ఇదే భూమికి సంబంధించి చిన్నపాటి వివాదాలు పోలీస్ స్టేషన్లో కేసులు ఇలా అనేకమే ఇప్పటివరకు జరిగాయి. ఈ ఏడాది ప్రారంభంలో చెన్నాయిగుంటకు సంబంధించిన రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిసి పంట కాలువను పునరుద్ధరించాలని, లే అవుట్ నిర్వహకులు ఉద్దేశపూర్వకంగా పంట కాలువను దారి మళ్ళిస్తున్నారని తమ గోడును వెళ్ళబోసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కు ఇచ్చిన వినతి మేరకు జనవరి 22వ తేదీ ఆర్డీవో కార్యాలయం నుండి సర్వేయర్లు, మండల సర్వేయర్లు, ఫిర్యాదు చేసిన రైతులతో కలసి సర్వే నంబర్ 78లోని పంట కాలువను పరిశీలించి, గ్రామస్తుల వాదనలను రికార్డు చేసుకొన్న అధికారగణం ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తామని చెప్పి వెళ్ళిపోయారు. అటు తర్వాత పంట కాలువ పూడ్చివేతపై అప్పటి తిరుపతి అర్బన్ మండల తహశీల్దార్ భాగ్యలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేస్తూ రికార్డుల్లో ఉన్న ప్రకారం పంట కాలువను పునరుద్ధరించాలని, లేఅవుట్ వద్దకు వెళ్లడంతో ఆమెకు బెదిరింపులు వచ్చాయి. దీంతో తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో లేఔట్ నిర్వాహకులు రాజారెడ్డిపై తహశీల్దార్ భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

→ అయితే ప్రస్తుతం.. ←

2018లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 304 ప్రకారం ఏదేని లేఅవుట్ నిర్మాణ సమయంలో కాలువలను మళ్లింపు చేసుకోవడానికి, అభ్యంతరం లేని భూముల వైపు మళ్ళించడానికి తగిన రుసుమును చెల్లించి, అటు తర్వాత అధికారుల నుండి అనుమతులు వచ్చిన తరువాత పనులు చేసుకొనేలా జీవో సారాంశం. కానీ సర్వే నెంబరు 78లో వేసిన లేఔట్ కు సంబంధించి అధికారులకు ఎటువంటి దరఖాస్తు చేసుకోకుండా, ప్రభుత్వానికి ఎటువంటి రుసుము పంట కాలవ మళ్లింపుకు సంబంధించి చేయకుండా నన్ను ఎవరురా అడిగేది అనే కోవలో యదేచ్ఛగా 13 అడుగులు వెడల్పు గల పంట కాలవను మళ్లింపు చేసి, లే అవుట్‌లో రోడ్ల నిర్మాణం కూడా చేస్తుండడం గమనార్హం. దీనిపై తిరుపతి అర్బన్ తాహశీల్దార్ సురేష్ బాబును వివరణ కోరగా 15 రోజులకు మునుపు 304 జీవో ప్రకారం లే అవుట్ నిర్వహకులు కాలువ మళ్లింపుకు సంబంధించి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, దీనిపై ఇరిగేషన్ శాఖ అధికారులకు కూడా లేఖ రాశామని చెబుతున్న పరిస్థితి. ఈ ఏడాది ప్రారంభం నుండే పంట కాలువ మళ్లింపుకు సంబంధించి పనులు ప్రారంభమై జూన్ మాసం చివర్లో పూర్తి చేసినట్లుగా భౌగోళిక వాస్తవ పరిస్థితులు చెబుతున్నా, చెయ్యకూడనిదంతా చేసేసి చివర్లో జీవోను అడ్డుపెట్టుకొని అనుమతులు ఉన్నాయని చెప్పుకోవడానికి ఏమో ఈ తతంగమంతా.

→ 22ఏ లో చేర్చుకు.. ←

మిట్టగాంధీపురం సమీపంలో అక్రమంగా పంట కాలవ మళ్లింపుకు సంబంధించి గత తిరుపతి అర్బన్ తాహశీల్దార్ భాగ్యలక్ష్మి ఫిర్యాదుతో, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు 22ఏ లో పెట్టడానికి ఆదేశాలు జారీ జారీ చేశారని

ఈనెల సెప్టెంబర్ 8వ తేదీ నాటికి పంట కాలవను పూర్తిగా రూపుమాపి లేఔట్ లో రోడ్డు వేస్తున్న నిర్వాహకులు

ఆమె తెలిపారు. 22ఏ లో నమోదు అయితే లే అవుట్ లో ప్లాట్ల రిజిస్ట్రేషన్ ఏ విధంగా సాగుతుందో అధికార గణమే వివరించాల్సి ఉంది. కొత్తగా జీవో ఉందని చెప్పడం ఇరిగేషన్ శాఖకు ప్రతికూలమా...?, లేక లేఅవుట్ వేసిన వారికి అనుకూలమా....? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

■ పంట కాలువను గుర్తించడానికి లేఖ రాశాం..

సర్వే నెంబర్ 78లో మునుపు ప్రవహిస్తున్న పంట కాలువను ఎక్కడినుండి ఎటువైపు వెళుతుంది అని చూపడానికి తిరుపతి అర్బన్ తాహశీల్దార్ సురేష్ బాబుకు ఇటీవల 3 పర్యాయాలు లేఖలు రాశాం. కానీ ఇప్పుడు ఏదో జీవో ఉందని చెబుతున్నారు. ఆ జీవోకు సంబంధించి మాకు ఎటువంటి సమాచారం లేదు. పంట కాలువ పారే భౌతిక స్వరూపాన్ని చూపాలని మరో మారు కోరుతాం. మా ఇరిగేషన్ శాఖకు సంబంధించి పంట కాలవ మళ్లింపుకు ఇటువంటి జీవో ఉందన్న సమాచారం లేదు.

- వెంకటేశ్వర ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్ శాఖ, తిరుపతి డివిజన్

రౌంటేబుల్ సమావేశం

ప్రజాశక్తి-కోట: కోట మండలం, షాది మంజిల్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి నెల్లూరు కోట కేంద్రం వారి ఆధ్వర్యంలో ఆదివారం రౌంటేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కోట ప్రాంతంలో నిర్వహించనున్న బహిరంగ సభ, ఆ సభ నిర్వహణకు సన్నాహాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మీజూరు మాధవ్, దాసరి సుందరం, వెంట్రుపాటి శ్రీనివాసరావులు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు, మాల ఉద్యోగుల సంఘాల నాయకులు, మాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

జంపర్లు తీశారు.. వేయడం మరిచారు

ప్రజాశక్తి -ఏర్పేడు : మొదలపాలెంలో గత వారం రోజులుగా త్రీఫేస్ కరెంట్ లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. వారం రోజుల కిందట ట్రాన్స్ఫార్మర్‌లో సమస్య ఉందని సంబంధిత లైన్ మాన్ జంపర్, ఫీజులు తొలగించి వెళ్లాడు. ఆ ట్రాన్స్ఫార్మర్ కింద లైన్లోకి చెట్లు కొమ్మలు తగులుతున్నాయని సదరు రైతుకు తెలియపరచగా ఆ రైతు చెట్టు కొమ్మలను తొలగించారు. అనంతరం లైన్ మాన్‌కి తెలియపరచినప్పటికీ, తిరిగి ట్రాన్స్ఫార్మర్‌కి ఫీజులు, జంపర్లు వేయకపోగా నిర్లక్ష్యంతో కనీసం ఎలొసి కూడా ఇవ్వకపోవడంతో రైతులు మండిపడుతున్నారు.

ఎస్ఈగా చంద్రశేఖర్ రావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఏపీ ఎస్పీడీసీఎల్ తిరుపతి జిల్లా ఎస్ఈగా చంద్రశేఖర రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఏపిఎస్పిడిసిఎల్ ఆపరేషన్ విభాగంలో తిరుపతి అర్బన్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న విన్న కోటి చంద్ర శేఖర్ రావ్‌కు సూపర్ఇంటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి లభించింది. ఆయనకు పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సత్యవేడు: స్థానిక సత్యవేడు బేరిశెట్టి కల్యాణమండపంలో సోమవారం జరుగనున్న డప్పు కళాకారుల సంఘం మండల మహాసభను జయప్రదం చేయాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేశాండీ అరుణాచలం పిలుపునిచ్చారు. ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వం డప్పు కళాకారుల మీద వివక్షత పాటిస్తుందని విమర్శించారు. సత్యవేడు మండలంలో 28 పంచాయతీలకు గాను 250 మంది డప్పు కళాకారులు ఉన్నారని తెలిపారు. కానీ అందులో సగం మందికి కూడా ప్రభుత్వం గుర్తింపు కార్డులు గానీ పెన్షన్ సౌకర్యం గాని కల్పించ లేదన్నారు. రీ సర్వే పేరుతో పెన్షన్లు తొలగించాలని ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్, యువజన నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వ సభ్య సమావేశం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలంలో ఆదివారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశాల్లో పంచాయితీల్లో ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అన్ని శాఖల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్త్రీ శక్తీ పథకం గురించి చర్చించారు. తిరుపతి చంద్రగిరి మార్గంలో బస్సుల కొరతతో నియోజకవర్గ మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సుల్లో అప్పటికే నిండుగా వస్తున్నాయని, మహిళలు ఇబ్బంది పడుతున్నారని అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆర్టీసీ అధికారుల తీరుపై మండిపడ్డారు. పంచాయితీలలో జరిగిన పనులకు బిల్లులను ఇవ్వకుండా నిలుపుదల చేయాలని, పంచాయితీ ఈవోలకు ఇంచార్జి ఎంపీడీఓ ఆదేశాలు జారీ చేయడంపై సభ్యులు మండిపడ్డారు. వెంటనే ఏవో శేఖర్ కలుగజేసుకొని బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని తెలిపారు. అగరాల, ఐతేపల్లె, మామండూరు, పుల్లయ్యగారిపల్లి గ్రామాలలో అనధికారికంగా కొంతమంది వేటగాళ్లు రాత్రుల్లో విద్యుత్ నిలిపివేసి వన్యప్రాణులను వేటాడుతున్నారని సర్పంచులు ఐతేపల్లి శేఖర్, అగరాల భాస్కర్ రెడ్డి ఆరోపించారు.

గిరిజనులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-ఏర్పేడు: తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పేడు మండల ఎంపీడీవో మార్గదర్శకాలతో పిఎంయు గిరిజన సంక్షేమ శాఖ తిరుపతి వారి ఆధ్వర్యంలో సచివాలయాల వారిగా 22వ తేదీ నుండి 27వ తేదీ వరకు గిరిజనులకు ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆధార్ లేని గిరిజనులు తమ సచివాలయాలలో సంప్రదించి ఆధార్ నమోదు కేంద్రాలకు హాజరై నమోదు చేసుకోవలని అధికారులు సూచించారు.

గిరిజనుల అభివృద్ధే కూటమి లక్ష్యం

గిరిజన కాలనీల్లో పర్యటిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): గిరిజన కుటుంబాలను అభివృద్ధి బాటలో నడిపించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జనసేన నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పొయ్య పంచాయితీ, గిరిజన కాలనీ సమస్యలను తెలుసుకోవడానికి ఆదివారం ప్రజా పర్యటన పేరుతో జనసేన నాయకులు పర్యటించారు. ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఉన్నవారు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఇక్కడ నివాసం ఉంటున్నప్పటికీ ఏ ప్రభుత్వం కూడా ఇంతవరకు తమకు పక్కా గృహాలు నిర్మించకపోవడంతో ఈ పూరి గుడిసెలలోనే కాపురాలు చేస్తున్నామని, ఈ పూరిగుడిసెలకు కూడా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రిపూట ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. చీకట్లో విష కీటకాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని, ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నామన్నారు. జనసేన నాయకులు పేట చిరంజీవి, పేట చంద్రశేఖర్ సంయుక్తంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యలన్నీ పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, దినేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కపిలతీర్థం వద్ద బందోబస్తు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయంలో తర్పణాలు వదిలే భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ముందుగానే తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించడానికి అదనపు పోలీస్ సిబ్బందిని నియమించారు. ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేశారు. ఎస్పి స్వయంగా కపిలతీర్థం ఆలయ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. సోషల్ మీడియాలో తొక్కిసలాట జరిగిందనే వార్తలు నిరాధారమైనవని పోలీసులు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షులు పార్థసారథి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టీటీడీ కాంట్రాక్ట్ సూపర్వైజర్స్ అండ్ టెక్నీషియన్ యూనియన్ నూతన కమిటీని శుక్రవారం, శనివారం రెండు రోజులు పాటు యశోద నగర్‌లోని సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి .బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిటిడిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిరంతరం సిఐటియు పోరాడుతుందన్నారు. సిఐటియు పోరాట ఫలితంగానే బస్సు పాసులు, ఈఎస్ఐ,పిఎఫ్, యూనిఫారం, లడ్డు, వడ, బ్రహ్మోత్సవ బహుమానం, జీతాలు పెంపు వంటివి సాధించుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10 గంటల పనిని ప్రవేశపెట్టడాన్ని కార్మికులను దోపిడీ చేయడమేనని, పని గంటలపెంపు విధానం రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టిటిడిలో పని గంటల పెంపును తీసుకొస్తే సిఐటియు చూస్తూ ఊరుకోదన్నారు. రాత్రి వేళలో మహిళల కార్మికుల చేత పనిచేయించాలని చేసిన నిర్ణయాన్ని తప్పుపట్టారు. సూపర్వైజర్స్ అండ్ టెక్నీషియన్స్ సమస్యలపై టిటిడి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.టిటిడి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.సుబ్రమణ్యం, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎస్.మాధవ్ మాట్లాడుతూ సూపర్వైజర్లకు, టెక్నీషియన్లకు యాప్ సిస్టం ద్వారా పని భారంతోపాటు, ఒత్తిడి ఎక్కువ అవుతుందన్నారు. యాప్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులరైజ్ చేయాలని, ఆగిపోయిన లడ్డు, వడ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని, లడ్డు కార్డుతో పాటు, దర్శన సౌకర్యం కల్పించాలని టిటిడి యాజమాన్యాన్ని కోరారు. అనంతరం సూపర్వైజర్స్ అండ్ టెక్నీషియన్స్ నూతన కమిటీని 60 మందితో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా డి. పార్థసారథి రెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రఘును, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కే.త్యాగరాజులును, కోశాధికారిగా వి.చెంగలరాయలును, ఉపాధ్యక్షులుగా ఎన్.ఏకాంబరం, శరత్, ముని, త్యాగ, గురు సుబ్రహ్మణ్యం, దిలీప్, సుధాకర్ రెడ్డి, శివారెడ్డి, రమేష్, నాగరాజు సహాయ కార్యదర్శులు: నవీన్, కుమార్, వెంకటేష్, రమేష్, బాబురావు, సురేష్, చంద్రమ్మ, గిరి, నారాయణ, నరేంద్ర, కేశవులుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఐఐటీలో ఆర్ట్ వర్క్ షాప్ విజయవంతం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టిటిడి బోర్డు నెంబర్ భాను ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడులోని తిరుపతి ఐఐటీలో ఆర్టిస్టా ది ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న కళాంగిణి వేడుకలో చివరి రోజు ఆదివారం తిరుపతికి చెందిన మహిళ ఆర్టిస్టులు పెయింటింగ్ వేసిన చిత్రలేఖనలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. టిటిడి బోర్డు నెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, ఐఐటి డైరెక్టర్ ఎన్ సత్యనారాయణ ఈ ఫోటో ఎగ్జిబిషన్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ అడ్వైజర్ పంచేటి జష్ణవ్, ఆర్ట్ క్లబ్ హెడ్ అర్ఫా రుబీన్, మెంటర్ రోహన్ రతన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగ దారుడిపై ఏఈ దుర్భాషలు

ప్రజాశక్తి - బాలాయపల్లి : మండల పరిధిలోని చుట్టి గ్రామానికి చెందిన ఓ విద్యుత్ వినియోగ దారుడు ఇంటికి విద్యుత్ రావట్లేదని, విద్యుత్ స్తంభం వద్ద మంటలు చెలరేగుతున్నాయని పలుమార్లు విద్యుత్ లైన్మెన్‌కు ఫోన్ ద్వారా వినియోగదారుడు మొరపెట్టుకున్నారు. లైన్ మెన్ పట్టించుకోకపోవడంతో విసిగిపోయి ఏఈకి ఫోన్ చేయగా, ఏఈ రాజేష్ రేపు ఇంటికి వస్తా నీ వైర్ బాగాలేకుంటే మర్యాద ఉండదు. నీ అంతుచూస్తా అని ఫోన్ లోనే దుర్భాషలాడారు. మండలంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని చెప్పిన ఏఈ ఓ వినియోగదారుడిపై చిందులు వేయడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉషోదయ వాకర్స్ అసోసియేషన్, పుత్తూరు వారిచే పాలమంగళం, సచివాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ తిరుపతి వారి సహకారంతో దినకర్ గాండ్ల ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. 150మంది రోగులకు కంటి పరిక్షలు, బ్లడ్, షుగర్, ఎముకలు,ఈసీజీ పరీక్షలు చేసి 45000/-విలువ గల మందులు ఉచితంగా ఇచ్చారు. 27 మందిని కంటి ఆపరేషన్‌కి ఎంపిక చేశారు.

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట, వేణుగోపాలపురం శివాలయం వద్ద ఆదివారం యష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు డాక్టర్ వి.రాజ్ యశ్వంత్, డాక్టర్ జి రమ్య సుమారు 200 కి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ సాయికిరణ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ అవసరమైన 20 మందికి ఉచితంగా ఆపరేషన్ నిర్వహించేందుకు రెఫర్ చేశారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండల పరిధిలోని నరశింగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ దేవరాజ్ యువర్స్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, డెమెన్షియా ఇండియా అలైన్సెస్ సంయుక్తంగా, వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంగమ్మ, మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజ శేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ వయస్సు పెరిగే కొద్దీ గుర్తుపట్టే శక్తి, ఆలోచన, ప్రవర్తనలో మార్పులు రావడం కేవలం మతిమరుపు మాత్రమే కాదన్నారు. జీవన విధానాన్ని ప్రభావితం చేసే మెదడు సమస్య అన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, విశ్రాంత ఉద్యోగుల భవనంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుర్రం విజయ్ బాబు దాతృత్వంలో ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. జేవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జెవివి మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ సేవా కార్యక్రమాలు కూడా చేస్తుందన్నారు. దాత విజయ్ బాబు, వారి కుమార్తె ఇక్షిత కుటుంబ సభ్యులను అభినందించారు.

క్రైం న్యూస్

గుండె పోటుతో కానిస్టేబుల్ మృతి

వెంకటరత్నం (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గుండె పోటుతో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. తిరుపతి శెట్టిపల్లికి చెందిన వెంకటరత్నం ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకొని ఇంటికి వెళ్లిన అతను, ఒక్కసారిగా గుండె పోటు రావడంతో కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. ఆయన మృతి పట్ల పలువురు పోలీస్ అధికారులు, సహచారులు సంతాపం తెలియజేశారు.

వ్యవసాయ అధికారి హరిప్రసాద్..

హరిప్రసాద్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారి హరిప్రసాద్ శనివారం రాత్రి గుండె పోటు రావడంతో మృతి చెందారు. పులిచెర్ల మండలంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ ఐదు నెలల క్రితం బదిలీపై యర్రావారిపాలెం మండలానికి విచ్చేశారు. ఆయన మృతి పట్ల మండల అధికారులు, నాయకులు నివాళి అర్పించారు.

మరో బాలుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్వర్ణముఖి నది ప్రవాహ ఉధృతిలో కొట్టుకుని పోయి గల్లంతైన గుణ(14) మృతదేహం ఆదివారం లభ్యమయింది. గల్లంతయిన చోటుకి అతి సమీపంలోనే గుణ మృతదేహం తేలుతూ కనిపించడంతో స్థానికులు వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు బాలుడి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. శనివారం సాయంత్రం ఈత సరదా కోసం స్వర్ణముఖి నదిలో దిగి హరూన్ (8) మృతి చెందగా, గుణ గల్లంతైన సంగతి తెలిసిందే. ఆదివారం గుణ మృతదేహం బయటపడడంతో తల్లిదండ్రులు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

చిన్నారుల కుటుంబాలను ఆదుకోవాలి: అంజూరు

ఈత కోసం స్వర్ణముఖి నదిలో దిగి ప్రాణాలు పోగొట్టుకున్న చిన్నారుల కుటుంబాలను ఆదుకోవాలని మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిన్నారుల కుటుంబాలను ఆదివారం అంజూరు పరామర్శించారు. నదిలో నిర్మిస్తున్న చెక్ డ్యామ్ పనుల కారణంగా నీటి ప్రవాహాన్ని పక్కకు మళ్ళించడంతో ఉధృతి పెరిగి చిన్నారులు కొట్టుకుపోవడానికి కారణం అయిందని వాపోయారు. హరూన్, గుణ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, గుత్తివారిపల్లి సచివాలయం సమీపంలోని పంట పొలాల్లో ఆదివారం ఒక గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గుర్తు తెలియని యువకుడి వయస్సు సుమారు 25 నుండి 30 సంవత్సరాల మధ్యగా ఉండి, ఎత్తు సుమారు 5.8 అడుగులు, చామనచాయ వర్ణం కలిగియున్నాడు. ముదురు నీలం రంగు పుల్ నెక్ బనియన్, బ్లూ జీన్స్ ప్యాంట్ దరించి ఉన్నాడు. అతని శరీరంపై ఎటువంటి గాయాలు లేవు. ప్రాథమిక సమాచారం మేరకు మద్యం అధికంగా సేవించడం వలన డిహైడ్రేషన్‌తో మృతి చెంది ఉండవచ్చు. వెదల్లచెరువు వీఆర్ఏ ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

■ ఘనంగా గురజాడ జయంతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: గురజాడ జయంతి సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురజాడ జయంతిసభ ఆదివారం నిర్వహించారు. యశోద నగర్‌లోని వేమన విద్యాలకేంద్రంలో గురజాడ అప్పారావు చిత్రపటానికి వేమన విజ్ఞానకేంద్రం గౌరవ సలహాదారులు టెంకాయల దామోదరం, ప్రముఖ సాహితీవేత్తలు సాకం నాగరాజు, నడ్డినారాయణ, తిరుపతి రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, వాకా ప్రసాద్‌లు నివాళులర్పించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గురజాడ స్ఫూర్తిని కొనసాగించడమే వారికిచ్చే ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఒ.వెంకటరమణ, సాయిలక్ష్మి, లక్ష్మీనారాయణ, రఫీ, కెఆర్ సుబ్రహ్మణ్యం, ముఖేష్, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

27న చేపల పెంపకానికి బహిరంగ వేలం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, ఎస్.బి.ఆర్ పురం ఫార్మర్ సొసైటీ అధ్యక్షుడు ముణి రాజు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మణిరాజు మాట్లాడుతూ గ్రామ ప్రజలు, రైతుల అభివృద్ధి కొరకు వడమాల పేట మండల పరిధిలోని శ్రీ బొమ్మరాజపురం చెరువులో మునిగి ఉన్న పట్టా భూములు సుమారుగా 300 ఎకరాల భూమి ఉన్నదని మండల రెవెన్యూ వారు తెలిపారన్నారు. ఈ మేరకు ఎస్‌బిఆర్ పురం ఫార్మర్ సొసైటీ వారు నీటిపై చేపల పెంపకానికి బహిరంగ వేలం వేయడానికి గ్రామ రైతులు, ఫార్మర్స్ సొసైటీ సంయుక్తంగా నిర్ణయించిందన్నారు. 27వ తేది సాయంత్రం 3 గంటలకు స్థానిక ఫార్మర్ సోసైటీ కార్యాలయంలో వేలం వేయనున్నట్టు తెలిపారు. రూ.15వేల రూపాయలు కట్టి రసీదు పొందిన వారు మాత్రమే ఈ వేలం పాటలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు.

పంట పొలాల రోడ్లకు మహర్దశ

ప్రజాశక్తి -కోట : గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ సహకారంతో వ్యవసాయ మార్కెట్ ద్వారా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల, పంట పొలాల రోడ్లకు మహర్దశ రానున్నట్లు తిరుపతి పార్లమెంట్ మైనారిటీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్ తెలిపారు. పంట పొలాలకు లింకు రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దాదాపు కోటి రూపాయలు నిధులను వ్యవసాయ మార్కెట్ ద్వారా ఛైర్మన్ దారా ప్రమీల ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల రోడ్లను మాజీ మండల పరిషత్ అధ్యక్షులు మానికల పవన్ కుమార్ పరిశీలించారు. ప్రస్తుతం రోడ్లను నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, ఎంపీటీసీ సభ్యులు దారా సురేష్, షేక్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

ఎస్‌వి ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర

ప్రజాశక్తి - క్యాంపస్: ఎస్వి ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం ఉండాలంటే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కళాశాల ఆవరణలో విరివిగా చెట్లు పెంచాలని తెలిపారు.

శ్రీకాళహస్తి సివిల్ జడ్జి వారి కోర్టులో
Cr. I.P.No. 26/2024
పి.మునిశేఖర్ ...పిటిషనర్
వర్సెస్
వి.రఘురామ్ మరియు ఒకరు ...రెస్పాండెంట్స్
TO
R1: వద్ది రఘురామ్, తండ్రి చలపతి నాయుడు, డోర్‌నెం. 15-33-1, బి.పి.అగ్రహారం, శ్రీకాళహస్తి టౌన్, తిరుపతి జిల్లా.
మొదటి రెస్పాండెంట్‌కి నోటీసులు
పై కనిన ఐ.పి.లోని పిటిషనర్ పి.మునిశేఖర్, రెస్పాండెంట్స్ అయిన వద్ది రఘురామ్ మరియు జంగం హరితల మీద పై కోర్టు **Cr. I.P.** ని దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మొదటి రెస్పాండెంట్ అయిన వద్ది రఘురామ్‌కు నోటీసులు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారాను జారీ కానందున ప్రత్యామ్నాయ సర్వీసు నిమిత్తం 07.10.2025తేదీన ఉదయం 10:30ని॥లకు సదరు రెస్పాండెంట్‌పై కోర్టులో హాజరై తన యొక్క అభ్యర్థనలను నేరుగాగానీ, అడ్వకేట్ ద్వారా గానీ తెలుపుకొనవలెయును. అట్లు లేని యెడల సదరు దావాను సదరు రెస్పాండెంట్ పరోక్షములో తీర్మానించబడును.
ఇట్లు
కాయం సుధాకర్ రెడ్డి
అడ్వకేట్, శ్రీకాళహస్తి
సెల్: 9247318637